# పీఠిక

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

సర్వస్తోత్రాలూ అల్లాహ్ కొరకే. మనమందరమూ ఆయన్నే స్తుతిస్తున్నాము. సహాయం కొరకు ఆయన్నే అర్థిస్తున్నాము. పాపాల క్షమాపణకు ఆయన్నే వేడుకుంటున్నాము. మన మనోకాంక్షల మరియు పాపాల నుండి అల్లాహ్(త)ను శరణు కోరుతున్నాము. అల్లాహ్(త) మార్గదర్శకత్వం చూపిన వారిని ఎవ్వరూ మార్గభ్రష్టత్వానికి గురిచేయలేరు. అదేవిధంగా అల్లాహ్ (త) మార్గభ్రష్టత్వానికి గురిచేసిన వారికి ఎవ్వరూ మార్గదర్శకత్వం చేయలేరు. అల్లాహ్(త) తప్ప ఆరాధ్యులెవరూ లేరని నేను సాక్ష్యం ఇస్తున్నాను. ము'హమ్మద్ (స) అల్లాహ్(త) దాసులు మరియు ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యం ఇస్తున్నాను. విశ్వాస మార్గాలన్నీ నశించిన సమయంలో అల్లాహ్ (త) తన ప్రవక్తను ప్రభవింపజేశాడు. మార్గాలన్నీ మూసుకున్న తరుణంలో ఆయన (త) స్థానం తెలిసివచ్చింది.

ప్రవక్త (స) కనుమరుగైన విశ్వాస మార్గాలను స్పష్టంగా కనిపించినట్టు చేశారు. పవిత్ర వచనం ద్వారా రోగాలకు గురయిన వారికి ఆరోగ్యం ప్రసాదించారు. రుజుమార్గంపై నడిచే వారికి దాన్ని విశాలపరిచారు. సత్కార్యాల నిధులను అందరి అందుబాటులోకి తెచ్చారు. అల్లాహ్(త) స్తోత్రం తర్వాత ప్రవక్త(స)ను పూర్తిగా అనుసరించ నంత వరకు విశ్వాస మాధుర్యాన్ని చవిచూడలేము. ప్రవక్త (స) 'హదీసు'లను పూర్తిగా అనుసరించినంత వరకే విధేయతా వాగ్దానం నెరవేరుతుంది. ప్రవక్త (స) వివరణల ద్వారానే ఖుర్ఆన్‌ను అనుసరించటం జరుగుతుంది. వీటిని గురించి వ్రాయబడిన పుస్తకాల్లో «**మిష్కాతుల్ మ'సాబీ'హ్**» ప్రముఖమైనది. ఇందులో వివిధ 'హదీసు'లను చేర్చడం జరిగింది. దీన్ని **సమకూర్చి**, ప్రవక్త సాంప్రదాయాలను వ్యాపింపజేస్తూ, బిద్'అత్‌లను రూపుమాపడానికి ప్రయత్నించిన వారు: **ము'హ్యియ్ అస్సున్నహ్** - అబూ ము'హమ్మద్ - అల్ 'హుసైన్ బిన్ మస్'ఊద్ అల్ ఫరాఅ' అల్ **బ'గవీ [433 to 516 H/1122 CE]**. అల్లాహ్ (త) అతని తరగతులను అధికం చేయు గాక. అతను దీన్ని సమకూర్చినప్పుడు, 'హదీసు'ల పరంపరల ధృవీకరణను, ఉల్లేఖకుల పేర్లను ప్రస్తావించ లేదు. ఈ కారణంగా కొందరు 'హదీసు'వేత్తలు **మసాబీహ్** ను విమర్శించటం జరిగింది. ఎందుకంటే **ఉల్లేఖకుని** పేరు, **పుస్తకం** పేరు ప్రస్తావించకపోతే 'హదీసు' ప్రామాణికమైనదా, లేదా బలహీనమైనదా అనేది తెలియదు. పుస్తకం పేరు రెఫరెన్సు లేకుండా 'హదీసు'ను నమ్మడం చాలా కష్టం. దీన్నిబట్టి వారి విమర్శన కూడా సరైనదే. దీన్ని దృష్టిలో పెట్టుకొని మళ్ళీ మొదటి నుండి సంకలనం చేసే ప్రయత్నం చేశాను. ఈ మహా కార్యానికి నేను అల్లాహ్(త)తో ఇస్తిఖారా చేశాను. ఆయన్ను ఈ పని పూర్తిచేసే భాగ్యం కోసం అర్థించాను. అనంతరం అల్లాహ్ (త) నాకు దీన్ని పూర్తిచేసే భాగ్యం ప్రసాదించాడు. నేను గుర్తుల్లేని 'హదీసు'లకు గుర్తింపు పెట్టాను. అదేవిధంగా ఉల్లేఖకుల, పుస్తకాల పేర్లను పేర్కొన్నాను. ప్రతి 'హదీసు'ను దాని స్థానంలో పెట్టాను.

ఈ గ్రంథంలో: 1. అబూ 'అబ్దుల్లాహ్ - ము'హమ్మద్ బిన్ ఇస్మా'యీల్ బిన్ ఇబ్రాహీం అల్ **బు'ఖారీ**, 2. అబుల్ 'హసన్ – అసాకిరుద్దీన్ **ముస్లిమ్** బిన్ 'హజ్జాజ్ బిన్ ముస్లిమ్ బిన్ వ'ర్ద్ అల్ ఖుషైరీ అన్ నషాపూరి, 3. అబూ 'అబ్దుల్లాహ్ - **మాలిక్** బిన్ అనస్ బిన్ మాలిక్ బిన్ అబూ ఆమిర్ అల్అస్బాహీ, 4. అబూ 'అబ్దుల్లాహ్ - ము'హమ్మద్ బిన్ ఇద్రీస్ బిన్ అబ్బాస్ అష్-**షాఫయీ** అల్ **ఖురషీ**, 5. అబూ 'అబ్దుల్లాహ్ - అహ్మద్ బిన్ ముహమ్మద్ బిన్ '**హంబల్** అష్షైబానీ, 6. అబూ 'ఈసా - ము'హమ్మద్ బిన్ 'ఈసా బిన్ సూరా **తిర్మిజీ**' అస్ సులమి అల్ ఖురషీ, 7. **అబూ దావూద్** - సులైమాన్ బిన్ అల్ అష్అస్ అల్ అ'జ్ది అస్సజిస్తానీ, 8. అబూ 'అబ్దుర్ర'హ్మాన్ - 'అహ్మద్ బిన్ షుఐబ్ బిన్ అలి బిన్ సిన్నాన్ అన్ **నసాయీ**, 9. అబూ 'అబ్దుల్లాహ్ - ము'హమ్మద్ బిన్ య'జీద్ **ఇబ్నె మాజహ్ అర్ రబ'యీ** అల్ ఖ'జ్వీనీ, 10. అబూ ము'హమ్మద్ - 'అబ్దుల్లాహ్ బిన్ 'అబ్దుర్ర'హ్మాన్ బిన్ ఫ'ద్ల్ బిన్ బహ్రామ్ **దార్మీ**, 11. అబుల్ 'హసన్ - 'అలీ బిన్ 'ఉమర్ బిన్ అహ్మద్ **దార ఖుతునీ**, 12. అబూ బకర్ - అ'హ్మద్ బిన్ 'హుసైన్ బిన్ అలి బిన్ మూసా అల్ **బైహఖీ**, 13. అబుల్ 'హసన్ -

**ర'జీన్** బిన్ ము'ఆవియహ్ అల్ అబ్'దరీ, మొదలైన వారు సమకూర్చిన 'హదీసు'లు ఉన్నాయి. వీరి పేర్లను 'హదీసు'ల చివరలో పేర్కొన్నాము. దానికి తోడుగా వారి పుస్తకం పేరును కూడా పేర్కొన్నాము. మధ్యలో ఉన్న **పరంపరను** వదలివేశాము. ప్రారంభంలో 'హదీసు'లను **వివరించిన** ప్రవక్త (స) **సహచరుల** పేర్లను, చివరలో తమ గ్రంథంలో 'హదీసు'ను **ఉల్లేఖించిన 'హదీసు'వేత్తల** పేర్లను మాత్రమే పేర్కొన్నాము.

ఏ విధంగా **బ'గవీ** గారు తమ ఈ «**మ'సాబీ'హ్**» పుస్తకాన్ని అధ్యాయాల ప్రకారం విభజించారో నేను కూడా ఆ విధంగానే విభజించాను. ఒక అధ్యాయాన్ని **బ'గవీ** గారు 2 **విభాగాలుగా** విభజించారు. నేను **3 వ విభాగం** చేర్చాను. **మొదటి** విభాగంలో బు'ఖారీ, ముస్లిమ్ పేర్కొన్న 'హదీసు'లు లేదా వారిద్దరిలో ఒక్కరు పేర్కొన్న 'హదీసు'లను పేర్కొన్నాను. ఎందుకంటే వీరిద్దరూ ఇతరుల కంటే ప్రాధాన్యత గలవారు. **రెండవ** విభాగంలో వీరిద్దరితో పాటు ఇతరులు కూడా ఉల్లేఖించిన 'హదీసు'లను పేర్కొనడం జరిగింది. **మూడవ** విభాగంలో ప్రవక్త (స) అనుచరులు, తాబయీన్లు పేర్కొన్న 'హదీసు'లను పేర్కొనడం జరిగింది. అయితే ఇందులో 'హదీసు' షరతులను కూడా దృష్టిలో పెట్టుకోవటం జరిగింది.

ఒకవేళ **మ'సాబీ'హ్**లో ఉన్న 'హదీసు' **మిష్కాత్**లో లభించకపోతే, ఆ 'హదీసు' ఒకటి కంటే ఎక్కువ సార్లు వచ్చినందువల్ల దాన్ని తొలగించాను అని భావించాలి. అదేవిధంగా **మిష్కాత్**లో లేని, లేదా **మసాబీహ్**లో దాని భాగం లేని 'హదీసు'లు ఉంటే - అంటే హెచ్చుతగ్గులు ఉంటే - అవసరార్థం అలా చేయడం జరిగింది. ఒక్కొక్క చోట 'హదీసు'ను సంక్షిప్తంగా పేర్కొనడం జరిగింది. కొన్నిచోట్లలో పూర్తి 'హదీసు'ను పేర్కొనడం జరిగింది. ఒకవేళ మీకు రెండు భాగాల్లో తేడా కనబడితే, అంటే మొదటి భాగంలో బు'ఖారీ, ముస్లిమ్‌లను వదలి ఇతర 'హదీసు' వేత్తల 'హదీసు'లు ఉంటే, అదేవిధంగా రెండవ భాగంలో ఒకవేళ బు'ఖారీ ముస్లింల 'హదీసు'లు ఉంటే, వీరిద్దరి 'హదీసు'లను **'హుమైదీ** పుస్తకం నుండి మరియు **జామిఉల్ ఉసూల్** నుండి పరిశీలించిన తర్వాత పేర్కొనడం జరిగింది. ఒకవేళ తేడా ఉంటే అది వివిధ మార్గాల ద్వారా ధృవీకరణ పరంపరల వల్ల ఉంటుంది. లేదా **మ'సాబీ'హ్** కూర్పరి పేర్కొన్న మార్గం నాకు తెలియకపోవచ్చు.

మీకు నా ఈ పుస్తకం **మిష్కాతుల్ మ'సాబీ'హ్లో, మ'సాబీ'హ్** పేర్కొన్న అనేక పదాలు లభిస్తాయి. ఇందులో జరిగిన పొరపాట్లను అతని మీద కాక నాపై నెట్టివేయాలి. అల్లాహ్ (త) వారికి ఉభయలోకాల్లో సాఫల్యం ప్రసాదించు గాక. పరిశీలనలో నేను నా శక్తి మేరకు కృషిచేశాను. ఎటువంటి లోపం ఉంచలేదు. అభిప్రాయ భేదాల్ని ఉన్నవి ఉన్నట్లుగానే పేర్కొన్నాను.

అదేవిధంగా **మ'సాబీ'హ్** కూర్పరి కొన్ని 'హదీసు'లను 'గరీబ్ లేదా 'దయీఫ్‌లని సూచించారు. నేను నా సంకలనం **మిష్కాతుల్ మ'సాబీ'హ్**లో దానికి కారణాలు పేర్కొన్నాను. అదేవిధంగా 'హదీసు' నియమ నిబంధనల ప్రకారం సూచించని 'హదీసు'లను నేను కూడా సూచించలేదు. కాని కొన్నిచోట్లలో ప్రత్యేక సందర్భంగా ఆ 'హదీసు'ను గురించి కొంత పేర్కొన్నాను. అదేవిధంగా కొన్ని 'హదీసు'ల తర్వాత **రెఫరెన్సు**గానీ, పుస్తకం పేరు గానీ పేర్కొన లేదు. ఎందుకంటే 'హదీసు'వేత్తను గురించి తెలియనందువల్ల అలా జరిగింది. ఒకవేళ మీకు తెలిస్తే వ్రాయండి. అల్లాహ్ (త) మీకు ప్రతిఫలం ప్రసాదిస్తాడు.

నేను ఈ పుస్తకం పేరు "**మిష్కాతుల్ మ'సాబీ'హ్**" పెట్టాను. ఇంకా ఈ పుస్తకం పూర్తికావాలని, నాకు సరైన మార్గం చూపాలని, తప్పులు, పొరపాట్ల నుండి నన్ను రక్షించమని, నా సమస్యలను సులభతరం చేయమని, ఉభయలోకాల్లో ఈ కూర్పు ద్వారా లాభం చేకూర్చమని నేను అల్లాహ్(త)ను ప్రార్థిస్తున్నాను. కార్యసాధకుడైన అల్లాహ్(త)యే నాకు చాలు. సత్కార్యాలు చేసే, పాపాల నుండి దూరంగా ఉండే భాగ్యం అల్లాహ్ (త) వల్లనే లభిస్తుంది. ఆయనే అందరి కంటే గొప్పవాడు మరియు వివేకవంతుడూను.

కూర్పరి

**ము'హమ్మద్ బిన్ 'అబ్దుల్లాహ్ అల్ 'ఖ'తీబ్ అల్ 'ఉమరీ అత్ తబ్రీ'జీ** (మరణం 741 H /1341 CE)

*****